
సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 9 । డిసెంబర్ । 2022

ఐదు రోజులుగా 'చాపరాయి' మూత



డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం సందర్శనకు ఐదు రోజుల నుంచి అనుమతివ్వడం లేదు. చాపరాయి పరిసరాల్లో చెత్త పేరుకుపోవడంతో శుభ్రం చేయాలని, అంతవరకూ దానిని మూసివేయాలని ఎంపీడీవో నగేష్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఈ నెల 4న జలపాతం ప్రవేశ మార్గం గేటుకు తాళం వేశారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ షేక్ ముజీబ్‌ను వివరణ కోరగా కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత చాపరాయిని తెరుస్తామని చెప్పారు.

'ఎక్సైజ్ కేసుల' వాహనాల వేలం రేపు

హుకుంపేట: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో సారాతో పట్టుబడిన నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నాలుగు ఆటోలు, రెండు స్కూటీలను వేలం వేయనున్నట్టు ఎస్‌ఐ సతీష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ నెల 10న స్థానిక పోలీసు స్టేషన్ వద్ద వేలం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.ఆసక్తి గలవారు ఉదయం 8గంటలకు హాజరుకావాలన్నారు.

న్యూస్‌రీల్

ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్లను చేర్పించాలి

సబ్ కలెక్టర్ శుభం బన్సల్



మాట్లాడుతున్న రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రాజవొమ్మంగి: బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్లను చేర్పించాలని, 18, 19 సంవత్సరాల వయస్సు గల వారందరికీ ఓటు హక్కు కల్పించాలని సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. గురువారం రాజవొమ్మంగి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఆధార్‌కార్డు లేకపోయినా వయస్సు నిర్ధారణ చేసి ఓటు హక్కు కల్పించాలన్నారు. ప్రతీ వెయ్యి మంది జనాభాకు కనీసం 720 మంది ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు. మృతి చెందిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సిన బాధ్యతే బీఎల్‌వోలదేనని తెలిపారు. ఈ సమావేశంలో డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని దాకరాయి గ్రామంలో సబ్‌కలెక్టర్ కొన్ని గృహాలకు వెళ్లి వారికి ఓటుహక్కు ఉన్నదీ లేనిదీ అడిగి తెలుసుకొన్నారు.

రూ.50 లక్షలతో దారాలమ్మ ఆలయ అభివృద్ధి

ఎండోమెంట్ ఏసీ చంద్రశేఖర్



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎండోమెంట్ అధికారి చంద్రశేఖర్

సీలేరు: ఘాట్‌రోడ్డు గల దారాలమ్మ అమ్మవారి ఆలయాన్ని రూ.50 లక్షల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్టు దేవదాయశాఖ ఏసీ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం ఆయన దారాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన హుండీ ఆదాయం లెక్కింపును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీ ఆదాయం రూ.12,400 వచ్చినట్టు చెప్పారు. ఇటీవల అమ్మవారి ఆలయం వద్ద చోరీ జరగడంతో అప్రమత్తమయ్యామని, ముగ్గురు యువకులు ఆలయం వద్ద కాపలా ఉండేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవో సాంబశివరావు, జూనియర్ అసిస్టెంట్ చంద్రతేజ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా శాంతి స్థూపం



మద్దిగరువు వారపుసంతలో శాంతి స్థూపాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న గిరిజనులు

జి.మాడుగుల: మావోయిస్టుల చేతిలో అశువులుబాసిన గిరిజన సోదరులకు జోహార్లు అంటూ.. గురువారం జరిగిన మద్దిగరువు వారపుసంతలో మావోయిస్టులకు వ్యతిరేకంగా శాంతి స్థూపం వెలిసింది. గిరిజన ప్రాంతాలకు చెందిన అనేక మంది ఆదివాసీలు మావోయిస్టుల చేతిలో మరణించినట్టు ఆ స్థూపంపై పేర్కొన్నారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలసిన శాంతి స్థూపాన్ని మారుమూల ప్రాంత గిరిజనులు ఆసక్తిగా తిలకించారు.

ఈఎంఆర్‌ఐలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

హుకుంపేట: ఈఎంఆర్‌ఐలో యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని ఈఎంఆర్‌ఐ ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. అనుబంధంగా నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవల్లో జిల్లా అధికారి, జోనల్ ఆపరేషన్ మేనేజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎంబీఏ, బీటెక్ ఉత్తీర్ణులైన వారు అర్హులని, రాష్ట్రంలో ఎక్కడైనా పనిచేయవలసి ఉంటుందని చెప్పారు. ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు విజయవాడ, విశాఖపట్నం కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు జరుగుతున్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావచ్చు తెలిపారు. వివరాలకు 8688548228 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

స్ట్రాబెర్రీ అదరహో..

స్ట్రాబెర్రీ సాగుతో గిరిజనులు, కౌలుదారులకు మంచి ఆదాయం లభిస్తోంది. రెట్టింపు రాబడి వస్తుండడంతో వీటిని సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో జిల్లాలో సాగు విస్తీర్ణం పెరగుతోంది.

- ఆంధ్రా కశ్మీర్‌లో విస్తరిస్తున్న స్ట్రాబెర్రీ సాగు
- 12 ఎకరాల్లో విరగ్గాసిన మొక్కలు
- హాట్‌కేకుల్లా అమ్మకాలు
- 200 గ్రాముల ప్యాక్ రూ.100



చింతపల్లి మండలం రాజుపాకలు ప్రాంతంలో స్ట్రాబెర్రీ సాగు

సాక్షి,పాడేరు: ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగి ప్రాంతంలో స్ట్రాబెర్రీ తోటలను విస్తారంగా వేస్తున్నారు. శీతల ప్రాంతంగా గుర్తింపు పొందిన లంబసింగి స్ట్రాబెర్రీ సాగుకు అనుకూలంగా ఉండడంతో ప్రతీ ఏడాది గిరిజనులతో పాటు, కౌలు రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. డ్రిప్ పద్ధతిలో ఈ పంటను గత నాలుగేళ్లుగా సాగుచేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో పేరొందిన రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన సీనియర్ రైతులు, గిరిజనుల భాగస్వామ్యంతో పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం చుట్టారు. చింతపల్లి మండలం లంబసింగి ప్రాంతంలో ఐదు ఎకరాలు, చిట్రాలగొప్పులో ఐదు ఎకరాలు, రాజుపాకలలో రెండు ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం స్ట్రాబెర్రీ సాగవుతుండగా.. దిగుబడులు ప్రారంభమయ్యాయి.

ఎకరానికి రూ.10 లక్షల ఆదాయం

స్ట్రాబెర్రీ పండ్లకు ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ఏజెన్సీని సందర్శించేందుకు వచ్చే పర్యాటకులు ఈ పండ్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఎకరం పంటకు రూ.5లక్షల వరకు ఖర్చవుతుండగా నవంబర్ నుంచి ఫిబ్రవరి నెల వరకు విరగ్గాసే స్ట్రాబెర్రీ పండ్ల అమ్మకాల ద్వారా రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుందని సాగుదారులు తెలిపారు. స్ట్రాబెర్రీ పండ్ల తోటల సాగు ద్వారా భూమి యజమాని అయిన గిరిజన రైతుతో పాటు ఆగస్టు నుంచి ఫిబ్రవరి నెల వరకు తోటల్లో పనిచేసే స్థానిక గిరిజనులకు కూడా ఆదాయం లభిస్తోంది. సాగు చేసిన కౌలు రైతులను కూడా ఈ తోటలు ఆదుకుంటున్నాయి.

200 గ్రాముల ప్యాక్ రూ.100

ఈ ప్రాంతంలో స్ట్రాబెర్రీ మొక్కలు విరగ్గాసాయి. పండ్ల దిగుబడి ప్రారంభమై హాట్ కేకుల్లా అమ్మకాలు జరుగుతున్నాయి. లంబసింగి, చిట్రాలగొప్పు, రాజుపాకల ప్రాంతాల్లో సాగవుతున్న స్ట్రాబెర్రీ తోటలకు పర్యాటకులు నేరుగా వెళ్లి తాజా పండ్లను కొనుగోలు చేస్తున్నారు. 200 గ్రాముల



స్ట్రాబెర్రీ పండ్లు

ప్యాక్‌ను రూ.100కు స్థానికంగా అమ్మకాలు జరుపుతుండగా విశాఖపట్నం ప్రాంతంలోని పలువురు వ్యాపారులకు రూ.80కే విక్రయిస్తున్నారు. ప్రస్తుతం లంబసింగి ప్రాంతంలో స్ట్రాబెర్రీ పండ్ల వ్యాపారం జోరందుకుంది.

భారీగా రోజువారీ విక్రయాలు



సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న స్ట్రాబెర్రీ కొనుగోలుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. పండ్ల కాపు కూడా అధికంగా ఉండడంతో రోజు వారీ విక్రయాలు భారీగానే జరుగుతున్నాయి. రెండు ఎకరాల్లో పంటను సాగు చేస్తున్నాం. ఇప్పటికే రూ.10 లక్షలు ఖర్చు పెట్టగా ఫిబ్రవరి నెలఖారునాటికి సుమారు రూ.20 లక్షల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నాం. తోటల్లో కూలి పనులకు స్థానిక గిరిజన యువతి, యువకులనే వినియోగిస్తున్నాం.

-కె. సంధ్య, స్ట్రాబెర్రీ తోటల సాగు రైతు, రాజుపాకలు, చింతపల్లి మండలం.

ఆధార్ అప్‌డేట్ వేగవంతం

కలెక్టర్ సుమిత్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి, పాడేరు: ఆధార్ అప్‌డేట్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ప్రతీ డిజిటల్ అసిస్టెంట్ రోజుకు 30 కార్డుల చొప్పున అప్‌డేట్ చేయాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిజిటల్ అసిస్టెంట్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 73 ఆధార్ కేంద్రాలున్నాయని, 2010-16 సంవత్సరాల మధ్య ఆధార్‌కార్డులు చేయించుకున్న వారి సమాచారం మాత్రమే అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. సంవత్సరంలోపు పిల్లలకు సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలోని వివరాలను సేకరించి, ఆధార్ నమోదు చేయాలని సూచించారు. ఈ కార్య క్రమంలో ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ అధికారి రాంగోపాల్, జిల్లా డిజిటల్ అసిస్టెంట్ల పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్న అందరికీ ఉపాధి

ఐటీడీఏ పీవో ఆదేశం



మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ

పాడేరు రూరల్: ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి పనులు కల్పించాలని ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయం నుంచి ఏజెన్సీ 11 మండలాల ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఉపాధి హామీ అధికారులు, ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ, గృహ నిర్మాణాలు, మన బడి నాడు నేడు, మిషన్ కనెక్ట్ పాడేరు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, జల్‌జీవన్ మిషన్, గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులపై అయన సమీక్షించారు. ఉపాధి కూలీల ఆధార్ సీడింగ్ త్వరితగతిన చేయాలని సూచించారు. గృహ నిర్మాణాలు చేస్తున్న స్థలాలకు లబ్ధిదారులతో ఫొటోలు తీసి జియో ట్యాగింగ్ చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గృహ నిర్మాణాలకు రూ.35వేలు మంజూరు చేయాలని సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులు నిర్దిష్టమైన సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేయడానికి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు దృష్టి సారించాలన్నారు. పూర్తి చేసిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను సంబంధిత అధికారులకు అప్పగించాలని తెలిపారు. గుల్లేలు-కంద్రుం, చింతపల్లి-సీలేరు రోడ్డు పను ల పురోగతిపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుత్తులపుట్టు రోడ్డుకు రూ.35లక్షలు మంజూరు చేశామని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నాడు నేడు పనులు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో డీఈవో డాక్టర్ పి.రమేష్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు, కె.వేణుగోపాల్, ఆర్ అండ్‌బీ ఈఈ బాలసుందర బాబు, పంచాయతీ రాజ్ ఈఈ కొండయ్యడాల్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఈఈ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్య

- కార్యాలయం ఆవరణలో ఉరి వేసుకుని బలవన్మరణం
- గుండెలవిసేలా రోదించిన కుటుంబ సభ్యులు



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, బంధువులు



పెదబయలు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాసరావు



సంఘటన స్థలాన్ని, మృతదేహాన్ని పరిశీలిస్తున్న జేసీ, సబ్ కలెక్టర్

పెదబయలు: స్థానిక తహసీల్దార్ ఒల్ల శ్రీనివాసరావు(48) తన కార్యాలయం ఆవరణలోని పైకప్పు హుక్కుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. తహసీల్దార్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న చిన్న గదిలో శ్రీనివాసరావు ఒంటరిగా ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు స్థానిక పోలీసు స్టేషన్ క్యాంటిన్ నుంచి అటెండర్ రవికుమార్ టిఫిన్ తీసుకువెళ్లి తహసీల్దార్‌కు ఇచ్చి వెళ్లిపోయాడు. తరువాత మహిళా అటెండర్ అప్పలమ్మ కార్యాలయం శుభ్రం చేయడానికి 9.30 గంటలకు వెళ్లే సరికి ఆయన ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించారు. స్థానికంగా ఉన్న సీతగుంట గ్రామ సచివాలయం వీఆర్వో సత్యారావుకు సమాచారం అందించడంతో వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం తెలిసిన జేసీ జె.శివశ్రీనివాసరావు, పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ హుటాహుటిన తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి, సిబ్బందితో మాట్లాడారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. పూర్తి స్థాయిలో విచారణ జరపాలని పోలీసులను ఆదేశించారు. విజయనగరంలో ఉంటున్న తహసీల్దార్ కుటుంబ సభ్యులకు వెంటనే సమాచారం అందించారు.

పదోన్నతిపై వచ్చి ఆరు నెలలు..

విజయనగరం జిల్లా పౌర సరఫరాల శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతి, బదిలీపై ఈ ఏడాది జూన్‌లో శ్రీనివాసరావు ఇక్కడికి వచ్చారు. ఆయనకు తల్లి, భార్య, ఏడాదిన్నర వయస్సు కలిగిన కుమార్తె ఉన్నారు. శ్రీనివాసరావుకు 2007లో వివాహం జరిగింది. 15ఏళ్ల తరువాత వీరికి పాప పుట్టింది. కుటుంబ సభ్యులు విజయనగరం జిల్లా కేంద్రంలోని గొల్లవీధిలో నివాసముంటున్నారు. ఆయన ఇక్కడ ఒంటరిగా ఉంటున్నారు. సెలవు రోజుల్లో విజయనగరంలో ఇంటికి వెళ్లి వస్తుండేవారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహిస్తున్నారు. అందరితో కలివిడిగా ఉండే శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలియడంతో స్థానికులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సమాచారం తెలిసిన వెంటనే ఇక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

మృతిపై కుటుంబ సభ్యుల అనుమానాలు

తన భర్త ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, ఆయన మరణంపై అనుమానాలున్నాయని శ్రీనివాసరావు భార్య లక్ష్మీ శివజ్యోతితోపాటు కుటుంబ సభ్యులు తెలిపారు. తక్కువ ఎత్తులో మృతదేహం వేలాడుతోందని, అందువల్ల ఉరి కారణంగా చనిపోయే అవకాశం లేదని వారన్నారు. కుటుంబ, ఆరోగ్య సమస్యలు ఏవీ లేవని వారు చెప్పారు. పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పోస్టుమార్టాన్ని కేజీహెచ్‌లో నిర్వహించాలని కోరారు.ఆత్మహత్యగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు.

చెట్టి పాల్గుణ, కుంభా రవిబాబు సంతాపం

శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ,రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు ఫోన్‌లో సంతాపం తెలిపారు. స్థానిక జెడ్పీటీసీ బొంజుబాబు,ఎంపీపీ వరహాలమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర మండలాల రెవెన్యూ సిబ్బంది పరామర్శించారు.

కొండగుడి సంబరం



భక్తజనసందోహం నడుమ మేరీమాత ఊరేగింపు

- వైభవంగా కొండగుడి మేరీమాత పండగ
- దర్శించుకున్న వేలాది మంది భక్తులు
- అమలోద్భవి మాతకు ప్రత్యేక పూజలు
- భారీ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న యువతులు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): క్రీస్తుకు జన్మనిచ్చి, ప్రపంచాన్ని పునీతం చేసిన మేరీమాతను కనులారా చూడాలని, మాత కరుణ కటాక్షాలు తమపై ప్రసరించాలని భక్తులు పరితపించారు. దూరాభారం లెక్క చేయకుండా వేలాదిగా తరలివచ్చారు. గంటల కొద్దీ నిరీక్షించారు. కొండగుడి ఉత్సవాన్ని చూసి భక్తి తన్మయత్వంలో మునిగిపోయారు. పాత పోస్టాఫీస్ ప్రాంతంలోని రోస్‌హిల్స్‌పై వెలసిన అమలోద్భవి అమ్మవారిని దర్శించుకోవడానికి అశేష భక్తజనం తరలివచ్చింది. భక్తి పారవశ్యంతో మాతను స్మరిస్తూ.. ఆరాధకుల గీతాలాపనలు.. సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం అగ్ర పీఠాధిపతుల బోధనలు, ఇలా అక్కడ అణువణువునా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఉభయ గోదావరి, కృష్ణ జిల్లాల నుంచి అమ్మ కరుణ కోసం తరలివచ్చిన ఆరాధకులతో విశాఖ జనపురిగా మారిపోయింది. కుల, మతాలకు అతీతంగా అమ్మవారిని దర్శించుకోవడంతో పరమత సహనం పరిఢవిల్లింది.

భక్తి శ్రద్ధలతో దివ్యపూజా బలి

కొండగుడిలో వెలసిన అమలోద్భవి మాత(విశాఖపురి మేరీమాత) ఉత్సవాలు గత నెల 29న ప్రారంభం కాగా గురువారంతో ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు నవ దిన ప్రార్థనలు నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం దేవాలయం వద్ద దివ్యపూజ నిర్వహించారు. పూజలో ఎక్కువ మంది కన్యలు రాష్ట్ర నలుమూలల నుంచి హాజరై ప్రార్థనలు చేశారు. ఉదయం 7.30 గంటలకు గుహవద్ద విశాఖ అగ్రపీఠాధిపతి ఫాదర్ మల్లవరపు ప్రకాష్ సమిష్టి దివ్యబలి పూజ ప్రసంగమిచ్చారు. 350 మంది వలంటీర్లు, 50 మంది గురువులే గాక నగరంలోని వివిధ చర్చిలకు చెందిన ఫాదర్లు, బ్రదర్స్ ఈ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో చేపట్టారు. మధ్యాహ్నం పాతపోస్టాఫీస్ వద్ద ఉన్న సెయింట్ అలెయిసిస్ పాఠశాల నుంచి అశేష ఆరాధకులు మేరీమాత స్వరూపంతో ప్రదక్షిణగా కొండపై ఉన్న ప్రధాన దేవాలయానికి చేరుకున్నారు. ఆరాధకుల సందర్శనార్థం ఆలయం బయట అమలోద్భవి స్వరూపాన్ని ఉంచారు. ఆరాధకులు అమ్మవారికి తమ శక్తి మేరకు బంగారం, వెండి కానుకలు సమర్పించుకున్నారు. కొంత మంది తలనీలాలు సమర్పించి తమ భక్తి తత్పరతను చాటుకున్నారు. లూర్దుమాత గుహ వద్ద దివ్యపూజ బలితో మహోత్సవం ముగిసింది. వివిధ స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి.

గజ..గజ

- చింతపల్లి : 9 డిగ్రీలు
- మినుములూరు : 10 డిగ్రీలు
- అరకులోయలో : 11 డిగ్రీలు



చలిమంటను ఆశ్రయించిన గిరిజనుడు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నాయి.చలిగాలులు అధికమవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 9 డిగ్రీలు,పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 10 డిగ్రీలు,అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 11డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు గురువారం నమోదయ్యాయి.ఉదయం 9గంటల వరకు పొగ మంచు కురిసింది.

తొలిసారిగా ఆర్థోపెడిక్ ఆపరేషన్లు

పాడేరు జిల్లా ఆస్పత్రిలో విజయవంతమైన రెండు శస్త్రచికిత్సలు



పాడేరు జిల్లా ఆస్పత్రిలో శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న వైద్యుల బృందం

పాడేరు రూరల్: స్థానిక జిల్లా ఆస్పత్రిలో తొలిసారిగా గురువారం ఆర్థోపెడిక్ ఆపరేషన్లు ప్రారంభించారు. మొదటి రోజు నిర్వహించిన రెండు శస్త్ర చికిత్సలు విజయవంతమయ్యాయి. ఆర్థో సర్జన్ డాక్టర్ జగన్నాథం, ఎనస్తీషియా స్పెషలిస్ట్ డాక్టర్ సాయి కుమార్‌తో కూడిన వైద్యుల బృందం విజయవంతంగా శస్త్ర చికిత్సలు నిర్వహించింది. పెదబయలు మండలం సీకరిపుట్టు గ్రామానికి చెందిన 50ఏళ్ల వి.పార్వతమ్మ 20రోజుల క్రితం కాలుజారి పడిపోయింది. ఆమె తొడ ఎముక పూర్తిగా దెబ్బతిని, నడవలేని స్థితికి చేరుకుంది. ఆమెకు సిమెంట్ బైపోలార్ హెమీ ఆర్థోప్లాస్టీ చేయడం అనివార్యమైంది. పాడేరు పట్టణానికి చెందిన ఎం.ప్రవీణ్‌కుమార్‌కు ఓ ప్రమాదంలో ఎడమ ముంజేయి ఎముకలు విరిగిపోయాయి. వీరిద్దరికీ గురువారం జిల్లా ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు, సిబ్బందితో కలిసి విజయవంతంగా ఆపరేషన్లు నిర్వహించారు. ఇదే ఆపరేషన్లను ప్రైవేట్ ఆస్పత్రిలో చేస్తే ఇద్దరికీ సుమారు రూ.1.70 లక్షలు ఖర్చు అయ్యేవని వైద్యులు తెలిపారు. పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్లు విజయవంతం కావడంతో రోగులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇకపై ఇలాంటి కేసులు వస్తే స్థానికంగానే ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. తొలిరోజే రెండు ఆర్థోపెడిక్ ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించడంపై ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు వైదులకు అభినందనలు తెలిపారు.

విలువిద్యలో గిరిజన విద్యార్థుల సత్తా



రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన గిరిజన విద్యార్థులు

రంపచోడవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన విలువిద్యపోటీలో ముసురుమిల్లి గిరిజనసంక్షేమ ఆశ్రమపాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి అండర్ -17 విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు, అండర్ -14 విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం కుమార్ తెలిపారు. 7వ తేదీన కాకినాడలో జరిగిన పోటీల్లో అండర్ -17 విభాగంలో పదో తరగతి విద్యార్థులు పల్లాల విజయకుమార్‌రెడ్డి మొదటి స్థానం, కుంజం దొరబాబుదొర రెండో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్ -14కు ఎనిమిదో తరగతి విద్యార్థులు కనుగల రాధమనోహర్‌రెడ్డి మొదటి స్థానం, పెమబల్లి వరుణ్‌కుమార్ రెండో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. మన్యం జిల్లా పార్వతీపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున వీరు పాల్గొంటారని తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ట్రైబల్ స్పోర్ట్స్ మీట్‌లో రాష్ట్ర స్థాయిలో పల్లాల విజయ్‌కుమార్‌రెడ్డి, కుంజం దొరబాబులు మొదటి, రెండు స్థానాలు సాధించినట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు ఎం. బుచ్చన్నదొర, పీడీ పాతురాజు, ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బోండ్ల వరప్రసాద్‌రావు అభినందించారు.

క్లుప్తంగా

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో గంజాయి సాగును నిర్మూలించేందుకు వీలుగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని జిల్లా ఉద్యానవనశాఖాధికారి రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.8.60 లక్షలతో 756 హెక్టార్లలో మామిడి, జీడి, అల్లం, కోకో తదితర పంటలు వేసేలా గిరిజన రైతులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. వంద హెక్టార్లలో కూరగాయాల పంట సాగుకు రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



దావనాపల్లిలో కాఫీ రైతులతో మాట్లాడుతున్న చింతపల్లి జీసీసీ డీఎం సింహాచలం

గూడెంకొత్తవీధి: కాఫీ రైతులు దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని గిరిజన సహకార సంస్థ చింతపల్లి డివిజనల్ మేనేజరు సింహాచలం తెలిపారు. గూడెంకొత్తవీధి జీసీసీ బ్రాంచి మేనేజరు మల్లేశ్వరరావుతో కలసి మండలంలోని దావనాపల్లిలో కాఫీ రైతులతో మాట్లాడారు. జీసీసీకి కాఫీని విక్రయించే రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఒకే సారి నిధులు జమ చేస్తున్నామన్నారు. జీసీసీ పేరు చెప్పి దళారులు గ్రామాల్లో కాఫీ రైతుల నుంచి కొనుగోలు చేస్తే వారి వివరాలను తమకు అందించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అనకాపల్లిటౌన్: గుర్తు తెలియని మృతదేహాన్ని పట్టణ పోలీసుల సహకారంతో సదా సోసల్ సర్వీస్ సభ్యులు గురువారం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. యాభై ఏళ్ల వ్యక్తి స్థానిక రింగ్‌రోడ్డులో మృతి చెందినట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సదా సోషల్ సర్వీస్ సహకారంతో మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయ మార్చురీకి తరలించినట్టు చెప్పారు.

గిరిజనుల ముంగిటకే భూసార పరీక్షలు

- అందుబాటులోకి వచ్చిన ల్యాబ్
- చింతపల్లిలోనే సేవలు



అందుబాటులోకి వచ్చిన భూసార పరీక్ష కేంద్రం

చింతపల్లి: ప్రతి రైతూ బాగుండాలనే లక్ష్యంతో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం కీలకమైన భూసార, సాగునీటి పరీక్షలు అందుబాటులోకి తీసుకొచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఈ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది. పరీక్ష ల్యాబ్‌లను ఇటీవల ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. దీంతో ముఖ్యంగా ఏజెన్సీ 11 మండలాల రైతులందరికీ భూసార సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఇక్కడ సేకరించిన మట్టి, సాగు నీరు పరీక్షల కోసం అనకాపల్లి ల్యాబ్‌కు పంపించేవారు. ఫలితాలు వచ్చే సరికి తీవ్ర జాప్యమయ్యేది. దీంతో రైతులు నష్టపోయేవారు. ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం నుంచి 2018లో ల్యాబ్ నిర్మాణానికి రూ. కోటి మంజూరయ్యాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో గతతేడాది ల్యాబ్ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేశారు. తాజాగా రూ.50 లక్షల విలువైన పరీక్షలకు సంబంధించిన అత్యాధునిక యంత్ర సామగ్రిని సమకూర్చారు. ఇంత వరకు పాడేరు డివిజన్ పరిధిలో సేకరించిన నమూనాలను పరీక్షల కోసం అనకాపల్లి పంపించేవారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఎరువులు, విత్తనాలు పరీక్షల ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. భూసార పరీక్షలు కూడా అందుబాటులోకి రావడంతో గిరిజన రైతులకు వ్యవసాయ పరంగా మరిన్ని సేవలు అందనున్నాయి. సాగు నీటిలో ప్రధానమైన పది రకాల పరీక్షలను, భూసార పరీక్షల్లో ఆరు రకాలను నిర్వహిస్తున్నారు.

ఇప్పటి వరకు 11 మండలాల రైతులు చేయించుకున్న పరీక్షలు
మట్టినమూనా 50
నీటి నమూనా 35

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



సాగునీటి, భూసార పరీక్షలు చేయించుకోవడం వలన ఎన్నో లాభాలు ఉన్నాయి. భూసార పరీక్షల వల్ల పొలంలో పోషకాల లోపం తెలుస్తుంది. దీంతో పంటకు అవసరమైన ఎరువులు వేసుకోవచ్చు.

–పి.జోగారావు, భూసార శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన కేంద్రం, చింతపల్లి

మతిభ్రమించి టీడీపీ నేతల ఆరోపణలు

- ఇదేం ఖర్మరా బాబు అని గత ఎన్నికల్లో బుద్ధి చెప్పారు
- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు



మాట్లాడుతున్న అధికార పార్టీ ఎంపీటీసీలు



పాత బస్టాండ్ వద్ద మాట్లాడుతున్న సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పాడేరు రూరల్: గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తుంటే, చూస్తూ ఓర్వలేక టీడీపీ నాయకులు అర్థరహిత ఆరోపణలు చేస్తున్నారని మండలంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు విమర్శించారు. గురువారం వారు వేర్వేరుగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వానికి ఇప్పుడు ప్రభుత్వానికి మధ్య తేడా తెలుసుకుని మాట్లాడాలన్నారు. ఇదేం ఖర్మరా బాబు అని గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి హయాంలో పాడేరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుండటాన్ని చూస్తూ ఓర్వలేక టీడీపీ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. కన్న తల్లి లాంటి పార్టీని కాదని కోట్లాది రూపాయలకు అమ్ముడుపోయి తమ ప్రభుత్వంపై, ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోణలు చేస్తుంటే, చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, డి. గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, కురబోయిన సన్నిబాబు, గొల్లోరి నీలకంఠం, పాంగి రాంబాబు, బోయిన చిట్టిబాబు, వైస్ ఎంపీపీ కుంతూరు కనకలమ్మ, ఎంపీటీసీలు దూసురి సన్యాసిరావు, లకే రామకృష్ణపాత్రుడు, కె. నర్సింహమూర్తి, సల్లా చిట్టమ్మ, చిప్పాడ మీనా, తూపురి ఎర్రయమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, ఏఎంసీ డైరెక్టర్ లకే రామసత్యవతి, యువజన విభాగం నాయకులు కొట్టగుళ్లి నాగేంద్ర, కె. కొండాజి, పలాసి కోటేశ్వరరావు, దూసురి గంగరాజు, వంజంగి నూకరాజు, తూపూరి గంగరాజు, అర్మ భీమరాజు పాల్గొన్నారు.

కుజభంగి కూడలి వద్ద వ్యాన్-బైక్ ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో వ్యాన్-బైక్ ఢీ కొట్టిన దృశ్యం

ముంచంగిపుట్టు: మండలంలోని కుజభంగి జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని వ్యాన్ బలంగా ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పెదబయలు మండలం మారుమూల జామిగూడ పంచాయతీ గుంజివాడ గ్రామానికి చెందిన జర్సింగి భాస్కర్‌రావు, జర్సింగి చంద్రమౌళి అనే ఇద్దరు యువకులు వ్యక్తిగత పనుల నిమిత్తం గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై పెదబయలు వస్తుండగా కుజభంగి జంక్షన్ వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న వ్యాన్ బలంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న భాస్కర్‌రావు, చంద్రమౌళి గాయపడ్డారు. వారిని హుటాహుటిన ముంచంగిపుట్టు సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు కల్పించారు. ఈ ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జయింది.

సైబర్ నేరగాడు అరెస్ట్

ముద్రా లోన్లు ఇప్పిస్తామని ఉపాధ్యాయుడికి టోకరా



నిందితుడిని అరెస్ట్ చూపిస్తున్న సీఐ సుధాకర్, ఎస్ఐ రంజిత్

పాడేరు రూరల్: ముద్రా లోన్ ఇప్పిస్తామని నమ్మించి ఓ ఉపాధ్యాయుడి నుంచి పెద్ద మొత్తంలో నగదు కాజేసిన సైబర్ నేరగాడిని ఎట్టకేలకు గురువారం పాడేరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పాడేరు సీఐ సుధాకర్ తెలిపిన వివరాలివి. 2020 నవంబర్‌లో ముద్రా లోన్ ఇస్తామని పాడేరులో ఓ ఉపాధ్యాయుడికి సైబర్ నేరగాడు ఫోన్ చేశాడు. తన అవసరాల దృష్ట్యా ఆ ఉపాధ్యాయుడు లోన్ కోసం ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లు పంపించగా రూ.3 లక్షల లోన్ మంజూరైందని, వివిధ ఫీజుల నిమిత్తం రూ.92 వేలు చెల్లించాలని ఆ తర్వాత ఆ నగదు మొత్తం రీఫండ్ అవుతుందని చెప్పడంతో ఆ ఉపాధ్యాయుడు నమ్మి రూ.92వేలు పంపించాడు. ఆ తర్వాత మీకు రూ.10 లక్షల లోన్ మంజూరు అయిందని చెప్పడంతో నిజమే అని నమ్మిన ఉపాధ్యాయుడు మళ్ళీ కొంత నగదు అతడికి పంపించాడు. ఇలా దశల వారీగా ఆ ఉపాధ్యాయుడు ఏకంగా రూ.34లక్షల 80వేల 152 సొమ్మును వివిధ బ్యాంకు ఖాతాలను జమ చేశాడు. ఎంతకీ లోన్ రాకపోవడంతో పాటు వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని తెలుసుకున్న ఉపాధ్యాయుడు 2022లో పాడేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దర్యాప్తు ప్రారంభించారు. పాడేరు ఇన్‌చార్జి ఏఎస్పీ ప్రతాప్ కిషోర్ పర్యవేక్షణలో పాడేరు సీఐ సుధాకర్ రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. సైబర్ నేరగాళ్ల అడ్రస్ ఆధారంగా బీహార్ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతమైన నలంద జిల్లా ఘెస్రావాన్ ప్రాంతంలోని మహిళ్ గ్రామానికి వెళ్లిన రెండు పోలీస్ బృందాలు సైబర్ నేరగాడు ఘన శ్యామ్ కుమార్‌ను గుర్తించి అరెస్ట్ చేసి పాడేరు తీసుకువచ్చారు. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న ఇతర నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ సుధాకర్ విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, డబ్బులు పోగొట్టుకుంటే రికవరీ చేయడం చాలా కష్టమైన విషయన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే ఏ ఇతర అపరిచిత లింకులు క్లిక్ చేయవద్దని, డాక్యుమెంట్లు ఎవ్వరికీ పంపించకుండా జాగ్రత్త పడాలని అన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులు చేపట్టేందుకు కమిటీలు

జిల్లా కోఆర్డినేటర్ పుల్లయ్య



మాట్లాడుతున్న జల్ జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ పుల్లయ్య

ముంచంగిపుట్టు: గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పనులు చేపట్టేందుకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శితో కూడిన 15 మందితో కమిటీ నియమించాలని సంబంధిత జిల్లా కోఆర్డినేటర్ పుల్లయ్య తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పనులను 2024లోగా పూర్తి చేసే లక్ష్యంతో అందరు పని చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, గ్రామాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. ముంచంగిపుట్టు మండలంలో 258 గ్రామాలకు రూ.29.45 కోట్లతో తాగునీటి పథకాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో గ్రావిటీ స్కీం ఉన్న గ్రామాలను సర్వే చేసి గుర్తించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్ కుమార్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తురాయిమెట్టలో వరి కుప్పలు దగ్ధం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు

పాడేరు రూరల్: మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ తురాయిమెట్ట గ్రామంలో ఐదుగురు గిరిజనులకు చెందిన వరి కుప్పలకు నిప్పు అంటుకుంది. కళ్లాల వద్ద చిన్న పిల్లలు ఆడుకుంటూ అనుకోకుండా నిప్పు వెలిగించడంతో మంటలు చెలరేగి వరి కుప్పలకు అంటుకుంది. దీంతో స్థానికులు రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబుకు సమాచారం ఇచ్చారు. బుల్లిబాబు వెంటనే అగ్నిమాపక శాఖకు ఫోన్ చేశారు. స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే అగ్నిమాపక వాహనంతో తురాయిమెట్ట గ్రామానికి వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే సగం వరకు వరి కుప్పలు కాలిపోయాయి. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు సంఘటన స్థలానికి చేరుకొని వరి కుప్పలు కాలిపోయిన బాధిత బోయిని కొండబాబు, రాజమ్మ, బుల్లమ్మ, పి.చిన్నబాలన్న, బి.సుబ్బారావులతో మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

గంజాయి గొడవలో కొట్టి చంపారు..



పాయకరావుపేట స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

పాయకరావుపేట: ఈనెల 2వ తేదీన పాయకరావుపేట అంబేద్కర్‌కాలనీలో వ్యక్తి హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ గురువారం పాయకరావుపేట పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. ప్లాస్టిక్ సామాన్లు ఏరుకుని విక్రయిస్తూ జీవించే అప్పారావు ఈనెల 2న హత్యకు గురైన విషయం విదితమే. అప్పారావు నిద్రిస్తుండగా ఎవరో బండరాయితో మోది హత్య చేసినట్టు అతని కుమార్తె ఇంజరపు శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై సీఐ అప్పలరాజు నేతృత్వంలో పోలీసుల బృందం విచారణ చేపట్టింది. మృతుడు అప్పారావు, మంగవరం గ్రామానికి చెందిన బద్దా శ్రీను అలియాస్ అబ్బాస్, అచ్చుతాపురం గ్రామానికి చెందిన కోనేటి పెదబాబు అలియాస్ జానీలు కలిసి తిరుగుతూ గంజాయి సేవించే వారు. గంజాయి సేవించే సమయంలో ఈ ముగ్గురి మధ్య ఘర్షణ జరిగిందన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ముగ్గురినీ కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టగా నిందితులు హత్య చేయడానికి గల కారణాలను వివరించారని డీఎస్పీ తెలిపారు. ఏజెన్సీ నుంచి గంజాయి తెచ్చుకునే విషయంలో వీరి మధ్య గొడవ జరిగిందన్నారు. ఈ ఘర్షణలో చిన అప్పారావు పెదబాబును కాలితో తన్నడంతో అతను పడిపోయాడని వెంటనే శ్రీను అలియాస్ అబ్బాస్ అనే వ్యక్తి అప్పారావును బండరాయితో కొట్టి చంపేసి పరారయ్యారని తెలిపారు. గురువారం తాండవ బ్రిడ్జి వద్ద వారిని పట్టుకుని విచారణ చేయడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని డీఎస్పీ తెలిపారు.

క్రికెట్ అభిమానులకు శుభవార్త

- మార్చి 19న ఆస్ట్రేలియా–భారత్ వన్డే
- మరోసారి విశాఖ వస్తున్న కంగారు జట్టు



విశాఖ స్పోర్ట్స్: విశాఖ క్రికెట్ అభిమానులకు శుభవార్త. భారత్‌లో పర్యటించనున్న ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు విశాఖలోని వైఎస్సార్ స్టేడియంలో వన్డే మ్యాచ్ ఆడేందుకు రానుంది. ఆస్ట్రేలియా జట్టు ఈ సిరీస్‌లో భాగంగా మూడు వన్డే మ్యాచ్‌లాడనుండగా.. రెండో వన్డే మార్చి19న వైఎస్సార్ స్టేడియం వేదికగా జరగనుంది. 17న తొలి వన్డే ముంబయిలో, 22న మూడో వన్డే చెన్నై వేదికగా బీసీసీఐ ఖరారు చేసింది. 12 ఏళ్ల విరామం అనంతరం మరోసారి ఆస్ట్రేలియా జట్టు విశాఖ క్రీడాభిమానులను అలరించనుంది. 2010 అక్టోబర్ 10న కంగారు జట్టు భారత్‌తో ఆడింది. అప్పట్లోనూ సిరీస్‌లో భాగంగా రెండో వన్డేలోనే ఇరు జట్లు ఇక్కడ తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన ఈ పోరులో భారత్ ఏడు బంతులుండగా విజయకేతనం ఎగురవేసింది. ఈ మ్యాచ్‌తో భారత్ సిరీస్‌లో ఆధిక్యాన్ని సాధించింది. విరాట్‌కోహ్లీ విశ్వరూపం చూపించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. భారత్ తరఫున శిఖర్‌ధావన్ ఈ మ్యాచ్‌లోనే అరంగేట్రం చేశాడు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం : జిల్లాలో ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహించనున్న ఏపీపీఎస్‌సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఏపీపీఎస్సీ పరీక్షలకు మొత్తం 7,535 మంది ఉద్యోగులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఇందుకోసం మొత్తం 9 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గ్యాడ్జెట్లు తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు స్క్రైబ్ వినియోగించినట్లయితే అదనపు సమయం కేటాయిస్తామని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి అరగంట ముందు కేంద్రాలకు అభ్యర్థులు హాజరుకావాలన్నారు.

గ్యాస్ లీకై నాలుగు పూరిళ్లు దగ్ధం



కాలిపోయిన పూరిళ్లు

రాంబిల్లి: రాంబిల్లి శివారు వాడపాలెంలో గురువారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో నాలుగు పూరిళ్లు కాలి బూడిదయ్యాయి. ఈ ఇళ్లలో ఏడు కుటుంబాలు నివసిస్తున్నాయని వీఆర్వో జగదీష్ తెలిపారు. సూరాడ పోలమ్మ, సూరాడ సత్తియ్య, గరికిన రామయ్యమ్మ, గరికిన చిట్టమ్మలకు చెందిన పూరిళ్లు కాలి బూడిదయ్యాయని, సుమారు రూ.10 లక్షలు ఆస్తినష్టం వాటిల్లిందని వీఆర్వో తెలిపారు. బాధిత కుటుంబాలను ఎంపీపీ శిరీషశ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ , సర్పంచ్ గరికిన రమనమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వర్మరాజు, మునలిరావు పరామర్శించారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు(కన్నబాబు) బాధిత కుటుంబాలకు బియ్యం, కూరగాయలు ఇతర రేషన్ సరుకులను పంపించారు. బాధిత కుటుంబాలకు పక్కా గృహాలు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే తెలిపారు

కాపులవాతాడలో వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న తాతారావు

నక్కపల్లి: ఎస్.రాయవరం మండలం కాపుల వాతాడ గ్రామంలో గురువారం దొడ్డి తాతారావు(39) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భవానీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. భవానీ తన చెల్లెలు డెలివరీ కోసం పుట్టింటికి గోపాలపట్నం వెళ్లింది. ఆమె భర్త తాతారావు తన తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈనెల 7వ తేదీ రాత్రి భోజనం చేసి వారి ఇంట్లోనే నిద్రపోయాడు. 8వ తేదీ ఉదయం లేచి చూసే సరికి ఇంటి వద్ద లేడు. బహిర్భూమికి వెళ్లాడని కుటుంబ సభ్యులు భావించారు. ఎంతసేపటికీ రాకపోవడంతో అతని కోసం వెతకడం ప్రారంభించారు. కాగా మామిడి తోటలో మామిడి చెట్టుకు చీరతో ఉరేసుకు తాతారావు మృతి చెందినట్టు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని అతని భార్య భవానీకి సమాచారం ఇచ్చారు. తన భర్తకు తరచూ కడుపు నొప్పి వస్తుందని మందులు కూడా వాడుతున్నాడని భవానీ తెలిపింది. తన భర్త ఆత్మహత్యపై ఎటువంటి అనుమానాలు, సందేహాలు లేవని తెలిపింది. భవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.రాయవరం పోలీసులు తెలిపారు. కడుపునొప్పి తాళలేక తాతారావు ఆత్మహత్య చేసుకున్నట్టుగా అందరూ భావిస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో ఎలక్ట్రికల్ చార్జింగ్ పాయింట్ ప్రారంభం



ఎలక్ట్రికల్ వాహనాల చార్జింగ్ పాయింట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో మరో సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. రైల్వేస్టేషన్ వద్ద విద్యుత్ వాహనాల చార్జింగ్ పాయింట్‌ను గురువారం వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ కుమార్ సత్పతి ప్రారంభించారు. ఈ సౌకర్యం డివిజన్ పరిధిలో మాత్రమే కాదు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జోన్‌లోనే మొదటిగా విశాఖలోనే ప్రారంభించినట్లు డీఆర్ఎం తెలిపారు. విద్యుత్ వాహనాలకు అవసరమైన చార్జింగ్ పాయింట్‌లను ఇక్కడ ఏర్పాటుచేయడం ద్వారా డివిజన్‌కు కూడా ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, ఇతర అధికారులు పాల్గొన్నారు.